సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 14 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,117 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.7 పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
36.7°/13.2°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ జాబితా

పుట్టపర్తి అర్బన్: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల వివరాలతో ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శనకు ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకూ జాబితా ప్రదర్శిస్తామని వివరాల్లో తేడాలుంటే రాతపూర్వకంగా ఆర్బీకే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. తుది జాబితా తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 96,024 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేయడంతో పాటు రైతుల ఈ-కేవైసీ 97 శాతం పూర్తి చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల ఆర్బీకేల వద్ద ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకూ ప్రదర్శిస్తామన్నారు.

రేపే ఇంటర్ పరీక్షలు

ప్రశాంతి నిలయం: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో 63,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాల్లో 21,904 మంది హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,299 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,008 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 11,169 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,428 మంది ఉన్నారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రశ్నపత్రాలను స్టోరేజ్ పాయింట్లకు (పోలీసు స్టేషన్) తరలించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అంటే ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. 8.45 గంటలకు గదిలోకి పంపుతారు. 9 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. విద్యార్థుల కోసం ఆర్ఐఓ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు ఏ చిన్న సమస్య తలెత్తినా కంట్రోల్ రూంలోని 08554-277626 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

నమో నారసింహా..

- వైభవంగా ఖాద్రీశుని బ్రహ్మ రథోత్సవం
- పోటెత్తిన భక్త జనం..
- గోవింద నామస్మరణతో మార్మోగిన కదిరి పట్టణం
- 5.51 గంటల పాటు సాగిన రథోత్సవం

కదిరి: గోవింద నామ స్మరణతో కదిరి మార్మోగింది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మరథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. రథోత్సవం ముగిసే వరకూ భక్తులంతా 'నమో..నారసింహ' అంటూ కీర్తించగా ఖాద్రీశుని నామంతో కదిరి పట్టణం ప్రతిధ్వనించింది.

ఉదయం 8.11 గంటలకు కదిలిన రథం..

బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నారసింహుడు తిరువీధుల గుండా విహరించేందుకు దేవతలు రోజూ ఒక్కో వాహనాన్ని పంపుతారని, బ్రహ్మరథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మ దేవుడే రథాన్ని నడిపి శ్రీవారు తిరువీధుల్లో విహరించేందుకు సహకరిస్తారని భక్తులు నమ్ముతారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం పూజల అనంతరం రథం 8.11 గంటలకు ముందుకు కదిలింది. ఆ సమయంలో తిరువీధులు భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగాయి. సరిగ్గా మధ్యాహ్నం 1.24 గంటలకు రథం యథాస్థానం చేరుకుంది. అక్కడక్కడా తిరువీధుల్లో రథం పలు ఇళ్లతో పాటు విద్యుత్ స్తంభాలను తాకుతూ వచ్చింది. మహాత్మాగాంధీ చౌక్‌లో కాసేపు, అలాగే హిందూపూర్ సర్కిల్‌లో సుమారు 45 నిమిషాల పాటు రథం ఆగిపోయింది. మొత్తం మీద తిరువీధుల్లో శ్రీవారు బ్రహ్మ రథంపై విహరించడానికి మొత్తం 5.15 గంటలు పట్టింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువ సమయమే పట్టింది. ఈసారి చిన్న చిన్న అవాంతరాలు మినహా రథోత్సవం దిగ్విజయంగా సాగింది.

రథోత్సవంలో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే..

ఆలయ అర్చక బృందం ఉదయాన్నే తేరు ముందు బలిహరణం, ఆస్థాన పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి తొలి పూజల్లో పాల్గొని, తర్వాత రథంపై ఆశీనులైన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన రథోత్సవాన్ని ప్రారంభించారు.

రథంపైకి దవణం, మిరియాలు..

ఎండలు మండుతున్నప్పటికీ భక్తులు తమ ఇలవేల్పు దేవుడ్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. తిరువీధుల్లోని మిద్దెలపైకి ఎక్కి రథోత్సవాన్ని తిలకించారు. దవణం, మిరియాలు రథంపై చల్లితే పాప విముక్తి కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు...రథంపైకి దవణం, మిరియాలు పోటీపడి చల్లారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఎప్పటిలాగానే రథంపై నిల్చొని రథ కదలికలను మైకు ద్వారా తెలియ జేశారు. ఆద్యంతం ''శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా...గోవిందా, ప్రహ్లాద వరద గోవిందా...గోవిందా, జయ జయ సింహా...జయ నరసింహా'' అంటూ భక్తులతో గోవింద నామ స్మరణలు చేయించారు.

మండుటెండను లెక్కచేయని భక్తులు..

సోమవారం ఉదయం నుంచే భానుడు భగభగ మండగా, ఎండ తీవ్రత పెరిగింది. అయినప్పటికీ భక్తులు ఎండను ఏమాత్రం లెక్కచేయకుండా రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తుల దాహార్తి తీర్చడం కోసం దాతలు అడుగడుగునా తాగునీటి ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆనవాయితీగా మూర్తిపల్లి, బేరిపల్లి, కుటాగుళ్ల, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్తులు సండ్ర మొద్దులు, తెడ్లు వేస్తూ రథం గమనాన్ని నియంత్రిస్తుంటే పెద్ద సంఖ్యలో భక్తులు బ్రహ్మ రథాన్ని లాగారు. రథం ముందు వెళ్తుంటే వెనుక భాగాన ఫైర్ ఇంజన్‌తో పాటు ప్రథమ చికిత్సకు సంబంధించిన అంబులెన్స్ వాహనాలు వెళ్లాయి. తొక్కిసలాటలో కొందరు స్వల్పంగా గాయపడగా, అప్పటికప్పుడే ప్రథమ చికిత్స చేస్తూ ముందుకు సాగిపోయారు. కదిరి డీఎస్పీ భవ్య కిశోర్ నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు అలుకోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు అశ్వవాహనంపై తిరువీధుల్లో దర్శనమిస్తారు. అంతకుముందు యాగశాలలో నిత్యహోమం తర్వాత శ్రీవారిని విశేషంగా అలంకరించి రాత్రి 7 గంటలకు ఆలయం పక్కనే ఉన్న అలుకోత్సవ మంటపం వద్దకు తీసుకొస్తారు.



ఖాద్రీశుని రథం ముందు కర్రసాముతో యువకుల విన్యాసాలు




మిద్దెల పైనుంచి రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఖాద్రీశుని రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్) రథంపై కొలువుదీరిన వసంతవల్లభుడు

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటింగ్ శాతం..		
నియోజకవర్గం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
ధర్మవరం	78.24	94.47
కదిరి	76.70	95.45
పుట్టపర్తి	75.71	90.4
పెనుకొండ	84.66	97.06
హిందూపురం	74.2	95.6
మడకశిర	76.0	92.0
రాప్తాడు	75.33	95.9



ఓటు వేశాక సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్



సిరా గుర్తు చూపుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ



హిందూపురం: పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్స్‌కు సీలు వేస్తున్న అధికారులు



హిందూపురం: ఓ మహిళ ఓటు వేసేందుకు వెళ్లగా ఆమె బిడ్డను లాలిస్తున్న కానిస్టేబుల్

పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఉత్సాహంగా తరలివచ్చిన ఓటర్లు
- కలెక్టర్ బసంత్‌కుమార్ సుడిగాలి పర్యటన
- ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ నేతృత్వంలో బందోబస్తు
- పట్టభద్రులతో పోలిస్తే ఉపాధ్యాయుల నుంచి అధిక స్పందన

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకూ కొనసాగింది. ఆరంభంలో మందకొడిగా సాగినా.. మధ్యాహ్నం తర్వాత పోలింగ్ శాతం పుంజుకుంది. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. వారందరికీ అధికారులు అదనపు సమయం కేటాయించారు. పట్టభద్రుల కంటే ఉపాధ్యాయుల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం విశేషం. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులు కల్పించారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా కలెక్టర్ పి.బసంత్‌కుమార్ నేతృత్వంలో అధికారులు సజావుగా ఎన్నికలు నిర్వహించారు.

సాఫీగా పోలింగ్..

జిల్లాలో పట్టభద్రుల ఎన్నికల కోసం 54 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 32 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 86 చోట్ల పోలింగ్ నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బందికి, పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి, మండల, డివిజనల్, జిల్లా స్థాయి ఎన్నికల సిబ్బందికి, నోడల్ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న అధికారులు

సోమవారం ఉదయం 8.30 గంటలకే కలెక్టర్ బసంత్‌కుమార్ పుట్టపర్తి శివాలయం వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. క్యూలో వెళ్లి ఓటు వేశారు. పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ పలు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అప్పటికప్పుడు అధికారులకు సూచనలిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చూశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును పరిశీలించారు.



హిందూపురం: పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ నమోదు ఇలా	(9 గంటలకు)	(12 గంటలకు)	(2 గంటలకు)	(4 గంటలకు)	పోలింగ్ ముగిసే సమయానికి
పట్టభద్రులు	11.36 శాతం	32.13	52.19	70.70	75
ఉపాధ్యాయులు	18.35 శాతం	53.46	76.88	92.71	92.71

జిల్లాలో పట్టభద్రులు ఓటింగ్	
పురుషులు	22,714
మహిళలు	9,909
మొత్తం	32,623
శాతం	75
ఉపాధ్యాయుల ఓటింగ్	
పురుషులు	2,168
మహిళలే	936
మొత్తం	3,104
శాతం	92.71

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఇలా...

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	పోలింగ్ శాతం
కర్నూలు	5,391	4,868	2,729	2,139	90.03
నంద్యాల	4,426	4,161	2,631	1,530	94.01
అనంతపురం	5,564	5,110	3,207	1,903	91.84
శ్రీసత్యసాయి	3,348	3,104	2,168	936	92.71
వైఎస్సార్	7,461	6,813	3,954	2,859	91.31
అన్నమయ్య	1,958	1,828	1,246	582	93.36
మొత్తం	28,148	25,884	15,935	9,949	92.21

జిల్లాల వారీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఇలా...

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	పోలింగ్ శాతం
కర్నూలు	61,633	43,944	30,581	13,363	-	71.03
నంద్యాల	54,929	42,310	30,241	12,068	1	77.03
అనంతపురం	68,341	52,136	35,506	16,629	1	76.29
శ్రీసత్యసాయి	43,310	32,623	22,714	9,909	-	75.00
వైఎస్సార్	81,317	58,927	38,560	20,366	1	72.01
అన్నమయ్య	20,594	15,163	10,525	4,637	1	73.63
మొత్తం	3,30,124	2,45,103	1,68,127	76,972	4	74.67

ఓటెత్తారు

- జిల్లాలో భారీగా పోలింగ్
- పట్టభద్రులు 75 శాతం, టీచర్స్ 92.71 శాతం పోలింగ్ నమోదు

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఓటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు క్యూలో నిల్చుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని మండలాల్లో సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. జిల్లాలో 3,348 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గానికి ఓటర్లు ఉండగా 3,104 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో పోలింగ్ శాతం 92.71గా నమోదైంది. ఇక పట్టభద్రుల నియోజక వర్గానికి సంబంధించి జిల్లాలో 43,310 మంది ఓటర్లు ఉండగా, 32,623 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం 75గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



పుట్టపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పోలింగ్ సరళి పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, మహమ్మద్ ఇక్బాల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి తదితరులు ఆయా నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పోలింగ్ తీరుపై ఆరా తీశారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం తథ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఓటర్లు ఉత్సాహంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, దీన్నిబట్టి చూస్తే వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి 1.35 లక్షల ఉద్యోగాలిచ్చి నిరుద్యోగులను ఆదుకున్నారని, ఆయన చేసిన మంచిని గుర్తించిన ఓటర్లంతా సంతోషంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి మద్దతు తెలిపారన్నారు.

ఓటమి భయంతోనే ఆరోపణలు..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళి చూసి జడుసుకున్న చంద్రబాబు...దొంగఓట్లంటూ గగ్గోలు పెడుతున్నాడన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు ఓట్లు ఎపుడు చేర్చారు...? తొలగింపుల ప్రక్రియ ఎప్పుడు జరిగింది... అన్న విషయాలూ తెలియవా అని ప్రశ్నించారు. నిజంగా దొంగ ఓట్లుంటే ఎన్నికల కమిషన్‌కు ఇంతవరకూ ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. కేవలం ఓటమి భయంతోనే దొంగ ఓట్లంటూ నాటకం ఆడుతున్నారన్నారు. జగనన్నపై ఎంతో నమ్మకంతో పట్టభద్రులు ఓటు వేయాలని ముందుకు వస్తే దొంగ ఓట్లని మాట్లాడడం చంద్రబాబుకు తగదన్నారు.

సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు..

జిల్లాలో అత్యధిక ఓటింగ్ నమోదు కావడానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పోలీసులతో పాటు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. పశ్చిమ రాయలసీమ నియోజకవర్గంలోని ఆరు జిల్లాల్లో శ్రీ సత్యసాయి జిల్లాలో అత్యధిక పోలింగ్ నమోదు కావడంలో అందరి కృషి ఉందన్నారు.

ఐదు స్థానాలూ మావే ..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరూ గెలుస్తున్నామని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. యువకులు, టీచర్లు ఉత్సాహంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నారన్నారు. ఉద్యోగ కల్పన, అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తున్న జగనన్నకు అండగా నిలవడానికి యువత ముందుకు వచ్చిందన్నారు. వార్ వన్‌సైడ్ అయిపోయిందని, అన్ని ఎమ్మెల్సీ స్థానాలు తప్పక గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల, టౌన్ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

జీడీఎస్ ఉద్యోగాలకు ఎంపిక జాబితా విడుదల

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని తపాలా డివిజన్లలో ఖాళీగా ఉన్న జీడీఎస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపికైన వారి జాబితాను ఆ శాఖ కేంద్ర కార్యాలయ అధికారులు సోమవారం విడుదల చేశారు. పదో తరగతి అర్హతతో ఎలాంటి రాత పరీక్ష లేకుండా, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ జాబితాను తపాలా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. హిందూపురం డివిజన్‌లో 98 మంది ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా తపాలా డివిజన్ కార్యాలయాల్లో వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు సెట్ల జిరాక్స్ కాపీలను ఆయా కార్యాలయాల్లో సమర్పించాలి.


అనంతపురంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


పెనుకొండలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్


పుట్టపర్తిలో ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న కలెక్టర్ బసంత్‌కుమార్


వెబ్‌క్యాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కొత్తగా నమోదైన ఓటర్ల మొదలు వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ సుడిగాలి పర్యటన సాగిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అనంతపురంలోని పాతూరు నంబర్-2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పుట్టపర్తిలోని శివాలయం వీధిలోని పోలింగ్ కేంద్రంలో సాధారణ ఓటర్లతో పాటు కలెక్టర్ బసంత్ కుమార్ క్యూలైన్‌లో వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం పలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌క్యాస్టింగ్ ద్వారా జిల్లాలోని మొత్తం కేంద్రాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పెనుకొండలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, నల్లమాడలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మడకశిరలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

– అనంతపురం సిటీ:


ధర్మవరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి


నల్లమాడలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి


మడకశిరలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి




రొద్దంలో ఓటు వేసేందుకు చంటి బిడ్డతో వచ్చిన బాలింత


హిందూపురంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్


ధర్మవరంలో ఓటింగ్ సరళిపై రిటర్నింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

పెనుకొండలో అత్యధిక పోలింగ్

సాక్షి, పుట్టపర్తి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గంలో నమోదైన పోలింగ్‌లో పెనుకొండలో అత్యధిక శాతం నమోదైంది. పట్టభద్రుల నియోజకవర్గం పోలింగ్ సరళి పరిశీలిస్తే పెనుకొండలో 84.66 శాతం, ధర్మవరంలో 78.24, కదిరిలో 76.70, మడకశిరలో 76.0, పుట్టపర్తిలో 75.71, రాప్తాడులో 75.33, హిందూపురంలో 74.2 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి పెనుకొండలో 97.06 శాతం, రాప్తాడులో 95.9, హిందూపురంలో 95.6, కదిరిలో 95.45, ధర్మవరంలో 94.47, మడకశిరలో 92.0, పుట్టపర్తిలో 90.4 శాతం మేర పోలింగ్ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 75 శాతం మంది, ఉపాధ్యాయులు 92.71 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

స్ట్రాంగ్ రూంలో బ్యాలెట్ బాక్సులు భద్రం


బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపయోగించిన బ్యాలెట్ బాక్సులు పోలింగ్ అనంతరం పుట్టపర్తిలోని చిన్నపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించి భద్రపరిచారు. జిల్లాలో 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 235 బ్యాలెట్ బాక్సులు వినియోగించారు. 11 రూట్ల ద్వారా వాటిని తిరిగి పుట్టపర్తికి చేర్చారు. అదేవిధంగా ఎన్నికల సిబ్బంది తీసుకెళ్లిన పోలింగ్ మెటీరియల్‌ను సైతం రిసెప్షన్ కేంద్రంలో అందజేశారు. స్ట్రాంగ్ రూంకు చేరిన బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్, డీఆర్‌ఓ కొండయ్య, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పరిశీలించారు. సాయుధ దళాలతో స్ట్రాంగ్ రూంకు భద్రత కల్పించారు.

సైనిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు


సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న జవాన్లు


మృతుడి భార్య, పిల్లలను ఓదారుస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి

ఓడీ చెరువు: సెలవుపై వచ్చి మృత్యుఒడికి చేరిన జవాన్ సోమశేఖరరెడ్డి(39) అంత్యక్రియలు సోమవారం వేమారెడ్డిపల్లిలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకు ముందు సోమశేఖరరెడ్డి మృతదేహానికి బెంగళూరు నుంచి వచ్చిన బీఎస్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ జాతీయ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎస్‌ఐ గోపి, బీఎస్‌ఎఫ్ జవాన్‌లు, స్థానిక ప్రముఖులు.. సోమశేఖరరెడ్డి పాడె మోసి శశ్మానికి చేర్చారు. అక్కడ సైనిక లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఓదార్చారు.

అట్టహాసంగా ప్రసాద వితరణ


ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచిన ప్రసాదం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్ప ఆలయం వద్ద 101 ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో సమర్పించిన బియ్యం, బెల్లం, బ్యాళ్లు ఇతర పదార్థాలను కలిపి ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భూతప్ప ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున లక్ష్మీ సమేత నరసింహస్వామి మూలవిరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా భూతప్పస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కాగా, మంగళవారం సాయంత్రం ఉత్సవాలు ముగియనున్నాయి.


భూతప్ప ప్రతిమలను అలంకరించిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు సుబ్బమ్మ


మృతి చెందిన నక్క

• నక్క కూడా మృత్యువాత

పావగడ: రోడ్డుకు అడ్డంగా వచ్చిన నక్కను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ మహిళతో పాటు నక్క కూడా మృతి చెందింది. ప్రత్యక్షసాక్షి బాలరాజు తెలిపిన మేరకు... రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన గొల్ల సుబ్బమ్మ (45) తన కుమారుడు బాలరాజుతో కలసి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామమైన భీమలనకుంటెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని తిమ్మమ్మనహళ్లి సమీపంలోకి చేరుకోగానే చీకట్లో రోడ్డుకు అడ్డంగా నక్క పరుగున వచ్చి ద్విచక్ర వాహనం కిందపడి మృతి చెందింది. ఘటనతో వాహనం అదుపు తప్పి కిందపడిన సుబ్బమ్మ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న వైఎన్ హొసకోట పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. నక్క కళేబరాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

గోరంట్ల: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన కేసులో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ జేఎఫ్‌సీఎం ముజీబ్‌పసల్ సయ్యద్ తీర్పు వెలువరించారు. ఈ మేరకు గోరంట్ల సీఐ సుబ్బరాయుడు సోమవారం వెల్లడించారు. కొత్తచెరువు గ్రామంలోని బీసీ కాలనీ నివాసి తలారి నరసింహులు 2021లో గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని గంగమ్మ ఆలయంతో పాటు గొనివారిపల్లిలో గంగమ్మ ఆలయం, జీనంవాండ్లపల్లి సమీపంలోని మారెమ్మ ఆలయంలో హుండీలు ధ్వంసం చేసి భక్తులు సమర్పించిన కానుకలతో పాటు గంటలూ అపహరించుకెళ్లాడు. ఈ ఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడు నరసింహులును అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో 18 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.